https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 6 బుధవారం 28-4-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## నేడే బెంగాల్ తుది దశ పోరు

మమత, మోదీల వ్యక్తిగత పోటీగా మారిన ఎన్నికలు

కీలకంగా కోల్‌కతా మహానగరం

ప్రభావం చూపనున్న 'సర్'



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28**

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సీఎం మమతా బెనర్జీకి, ప్రధాని మోదీకి మధ్య ప్రత్యక్ష పోరుగా మారాయి. బుధవారం చివరి దశలో భాగంగా ఏడు జిల్లాల్లోని 142 స్థానాలకు పోలింగ్ జరగనుంది. కీలక నేతలైన మమతా బెనర్జీ, బీజేపీకి చెందిన విపక్షనేత సువేందు అ?ధికారిల భవితవ్యం కూడా ఈ దశలోనే తేలనుంది. దక్షిణ బెంగాల్‌లోని ఈ నియోజకవర్గాలన్నీ తృణమూల్‌కు కంచుకో టల్లాంటివి కాగా, వాటిని ఆ పార్టీ నిలబెటు ్టకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది. బీజేపీ ఉత్తర బెంగాల్‌లో కొంతవరకు ప్రభావం చూపగలిగినా, దక్షిణ బెంగాల్‌లోనూ దారులు ఏర్పాటు చేసుకోలుగుతుందా అన్నదాన్ని ఈ ఎన్నికలు తేల్చనున్నాయి. మొదటి దశలో హోరాహోరీగా జరిగిన పోరు తర్వాత రెండో దశ రెండు పార్టీలకు మరింత కీలకంగా మారిందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. గతంలో ఈ 142 సీట్లలో బీజేపీ పలుసీట్లలో కొద్దిపాటి తేడాతో ఓడిపోయింది. 14 సీట్లలో కేవలం 10వేల తేడాతో ఓడిపోతే, 50 సీట్లను 25 వేల తేడాతో కోల్పోయింది. ఈ సారి ఆ సీట్లను వదలకూడదని కమలనాథులు భావిస్తున్నారు. రెండో దశ సీట్లలో కాంగ్రెస్, వామపక్షాల ప్రాబల్యం ఏమాత్రం లేదని, తృణమూల్, బీజేపీల మధ్యే ప్రత్యక్ష పోటీ ఉందని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఈ సీట్లలో తృణమూల్‌దే ఆధిపత్యం కొనసాగింది. బీజేపీ ఓట్ల శాతం పెరిగినా సీట్లు పరంగా పెద్దగా లబ్ధిపొందలేదు. అయితే ఈ సారి సీట్లు పెరుగుతాయని కమలం శ్రేణులు భావిస్తున్నాయి. ఇక్కడ తృణమూల్‌దే ఆధిక్యత అని పలు సర్వేలు చెబుతున్నా, ఒకటి రెండు సర్వేలు మాత్రం బీజేపీ 52 సీట్లు సాధిస్తాయని అంచనా వేశాయి. ప్రస్తుతం కోల్‌కతా, హౌరా, ఉత్తర-దక్షిణ 24 పరగణాలు, నదియా, హుగ్లీ, పూర్వ బర్ధమాన్ జిల్లాల్లో ఎన్నికలు జరగనున్నాయి. 2021 ఎన్నికల్లో తృణమూల్ 123 స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ కేవలం 18 స్థానాల్లో గెలుపొందింది. దక్షిణ బెంగాల్‌లో గెలవకుంటే సచివాలయమైన 'నబన్నా'కు మార్గం దొరకదన్న నానుడి ఉండడంతో అందరి దృష్టి తాజా ఎన్నికలపైనే ఉంది.

# ఏడుస్తూనే ఉండండి..

## నా పని చేసుకుంటూ పోతా: సీఎం రేవంత్

మరో పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుందామనుకున్నారు

అధికారం లాక్కున్నానని ఆ కుటుంబం పెడబొబ్బలు

శుక్రాచార్యుడు మారీచ, సుబాహులను వదిలాడు

ఫ్యూచర్ సిటీని సింగపూర్, టోక్యోల రేంజ్‌కి తీసుకెళ్తా

భూసేకరణలో తప్పులుంటే దిద్దుకుంటాం

రైతులూ భూములపై లీగల్ చిక్కుల్లోకి వెళ్లొద్దు

ఇప్పుడు తీసుకుంటే ఎకరాల్లో కొనుక్కోగలరు

పరిహారం ఆలస్యమైతే గజాల్లో కూడా కొనలేరు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌కు శంకుస్థాపన



**రంగారెడ్డి**

ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలోని ఆదర్శ నగరాలతో పోటీపడేలా నిర్మిస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులందరూ ఈ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇదే సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ భవనం, అక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను రిమోట్ పద్ధతిలో ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికీ శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఏ నగరానికీ లేని సదుపాయాలు, మౌలిక వసతులు హైదరాబాద్‌కు ఉన్నాయని దీంతో ఇక్కడ అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీని సింగపూర్, టోక్యో, న్యూయార్క్‌ల్లా అద్భుతమైన నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఫార్చ్యూన్-500 కంపెనీలు భారీ పెట్టుబడులతో ముందుకు వస్తున్నాయని తెలిపారు. ఫ్యూచర్ సిటీని మేడ్చల్ లేదా పటాన్‌చెరు వైపు కట్టాలని కూడా కొందరు కోరారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఈ ప్రాంతం మీదుగానే తాను తన ఊరికి వెళ్తానని, అందుకే ఇక్కడే ఫ్యూచర్ సిటీని ఎంపిక చేశానని తెలిపారు. గత ప్రభుత్వం ఇక్కడ కాలుష్య కారక పరిశ్రమలు పెట్టేందుకు నిర్ణయించిందని, ప్రజల జీవితాల్లో చీకట్లు ఉండకూడదనే ఉద్దేశంతో అద్భుత నగర నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. పడనోళ్లు, నచ్చనోళ్లు కడుపు నొప్పితో ఎద్దేవా మాటలు మాట్లాడుతున్నారని సీఎం చెప్పారు. మీరు ఏడ్చుకుంటూనే ఉండండి.. నేను చేసుకుంటూనే పోతానే ఉంటా అని విపక్షాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారం పోయిందని కేసీఆర్ కుటుంబం పెట్టే పెడబొబ్బలు తన చెవులో సంగీతం వినిపించినట్లు ఉంటుందని చెప్పారు. ఇంకో 10, 20 ఏళ్లు రాష్ట్రాన్ని దోచుకుందామని కలలు కన్నారని, అర్ధంతరంగా రైతు బిడ్డ వచ్చి గుంజుకుపోయాడనే బాధ కేసీఆర్ కుటుంబంలో ఎక్కువైందని వ్యాఖ్యానించారు. లోక కళ్యాణం కోసం ఎవరైనా యాగాలు చేస్తుంటే శుక్రాచార్యుడు మారీచుడు, సుబాహుడనే రాక్షసులను ఊరి మీదకు వదిలి యాగాల్లో రక్తం, మాంసాలు వేయించి అడ్డుకునే వాడని వ్యాఖ్యానించారు. ఫామ్‌హౌస్‌లో ఉన్న శుక్రాచార్యుడు ఇద్దరిని జనంలోకి వదిలాడని కేటీఆర్, హరీశ్‌లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని సీఎం తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు ఎప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటారని చెప్పారు. మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రైతులు సహకరిస్తే ప్రపంచంలోనే అద్భుతమైన నగర నిర్మాణానికి వేగంగా అడుగులు పడతాయని చెప్పారు. న్యాయపరమైన వివాదాలకు వెళ్లొద్దని రైతులను కోరారు. రైతులకు మర్యాద ఇచ్చి గౌరవించాలని అధికారులకు చెప్పారు. సమస్య తెగని పరిస్థితి వస్తే తన దృష్టికి తేవాలని ఆదేశించారు. భూసేకరణలో నాడు దేవేందర్‌గౌడ్ చొరవవల్లే రంగారెడ్డి జిల్లాకు ఇన్ని ప్రాజెక్టులు వచ్చాయని గుర్తు చేసుకున్నారు. ఏనాటికైనా భూమి ప్రభుత్వపరం అవుతుందని, భూసేకరణ వాయిదా వేయడం వల్ల రైతులే నష్టపోతారని చెప్పారు. పరిహారం తీసుకుని వేరే ప్రాంతాల్లో భూములు కొంటే రైతులకు ఎలాంటి నష్టం ఉండదని అన్నారు. వాయిదా వేస్తే ఎకరాల్లో కొనాల్సిన వాళ్లు గజాల్లో కూడా కొనలేని స్థితి ఎదురవుతుందని హితవు చెప్పారు.

# డేటా కేరాఫ్‌గా వైజాగ్

## గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

మన గడపలోకి గూగులమ్మ

ఏపీని వెతుక్కొంటూ వచ్చిన సెర్చ్ ఇంజన్

గూగుల్ క్లౌడ్ ఏఐ హబ్ దేశానికి గ్రోత్ ఇంజన్

2028 సెప్టెంబరు 28 నాటికి డేటా సెంటర్

అదానీ, భారతీ టెల్, గూగుల్ కలిస్తే సాధ్యమే

ప్రాజెక్టును 8 నెలల్లోనే లోకేశ్ సాధించారు

ఏఐ సేవకుడితోనూ మంత్రి పోటీ పడగలరు

ఉత్తరాంధ్రలో ఇక రివర్స్ వలసలు చూస్తాం

ఉద్యోగాల కోసం అందరూ ఇక్కడికే వస్తారు

గూగుల్ డేటా సెంటర్ భూమిపూజలో సీఎం




**అమరావతి, ఏప్రిల్ 28**

విశాఖ గూగుల్ క్లౌడ్ ఏఐ హబ్ దేశానికి గ్రోత్ ఇంజన్ కానుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "ప్రపంచం కొత్త అంశం తెలుసుకోవాలనుకుంటే, గూగుల్‌ను వెతుకుతుంది. కానీ, గూగుల్ తన డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు విశాఖను వెతుక్కుంటూ వచ్చింది." అని సీఎం వ్యాఖ్యానించారు. అదానీ, భారతీటెల్, గూగుల్ కలిస్తే సెప్టెంబరు 28, 2028 నాటికే డేటా సెంటర్ పూర్తవుతుందన్న నమ్మకం తనకుందని చంద్రబాబు అన్నారు. విశాఖ తుర్లవాడలో గూగుల్ డేటా సెంటర్‌కు కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, కింజరాపు రామ్మోహననాయుడు, గూగుల్ గ్లోబల్ ఇన్‌ఫ్రా క్లౌడ్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కొలే, ఐటీ శాఖమంత్రి లోకేశ్‌తో కలిసి చంద్రబాబు మంగళవారం భూమిపూజ చేశారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటులో ప్రధాని మోదీ సంపూర్ణ సహకారం అందించారని, ఇప్పుడే ఈ వేదిక నుంచే ఆయనను సెంటరు ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తున్నానని సీఎం అన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తవుతుందని, ఆ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మోదీని ఆహ్వానిస్తానని తెలిపారు. 60 రోజుల్లో అనకాపల్లికి గోదావరి జలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. "గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపనతో రాష్ట్రంలో టెక్నాలజీ రంగంలో కొత్త శకానికి శ్రీకారం చుట్టాం. రాష్ట్ర చరిత్రలో 2026 ఏప్రిల్ 28 సువర్ణాక్షరాలతో నిలిచిపోతుంది. 2025 సెప్టెంబరులో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటూ గూగుల్‌ను మంత్రి లోకేశ్ కోరారు. ఆ వెంటనే గూగుల్ సమ్మతిని తెలిపింది. ఈ సమాచారాన్ని ప్రధాని నరేంద్రమోదీకి చెప్పిన వెంటనే, ఆయన తన సహకారం అందించడానికి ముందుకొచ్చారు. గూగుల్ ఇండియాకు వస్తానంటే, కావాల్సినంత సహకారాన్ని అందిద్దామని మోదీ హామీఇచ్చారు. ఈమేరకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమైన మార్గదర్శకాలన్నింటినీ సరళతరం చేశారు. లోకేశ్ తొలిసారి గూగుల్‌ను సందర్శించినప్పుడు విశాఖకు గూగుల్ వస్తుందని ఎవరూ ఊహించలేదు. కానీ, గత ఏడాది సెప్టెంబరులో సంప్రదింపులు మొదలు పెట్టిన ఎనిమిది నెలల్లోనే ఏకంగా డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరిగింది. కార్యదక్షత, వేగాన్ని చూశాక, నాకు లోకేశ్‌పై విశ్వాసం కలిగింది. రాష్ట్రంలో 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ అందుబాటులో ఉంది. ఎనర్జీ, వైద్యం, భూగర్భ జలాలు, సాగునీటి వినియోగంపై గూగుల్ సహకారాన్ని కోరుతున్నాం." అని సీఎం అన్నారు. "సీఎంవోలోని నలుగురు కార్యదర్శులతోపాటు కొత్తగా ఏఐ అసిస్టెంట్‌ను నియమిస్తాం.

## నమోదైన దొంగ ఓట్లను గుర్తించండి: కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 28**

కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటికే నమోదు చేయించిన డబుల్, దొంగ ఓట్లను గుర్తించి వాటిని తొలగించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో దొంగ ఓట్లు నమోదు కాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్ జిల్లా పార్టీ నేతలతో సమావేశమైన ఆయన.. ఎన్నికల సంఘం సర్ పేరిట చేపట్టనున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై చర్చించారు. నగరంలో ఏ ఒక్క వ్యక్తి కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడాలని సూచించారు. కాగా, విద్యార్థి స్వచ్ఛంద సంస్థ స్ట్రీట్ కాజ్ సేవలు అభినందనీయమని కేటీఆర్ అన్నారు బంజారాహిల్స్‌లో నిర్వహించి న సదస్సులో ఆయన పాల్గొన్నారు. సంస్థ ఆవిర్భవించి 17 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా.. కేటీఆర్ రూ.17లక్షల విరాళాన్ని ప్రకటించారు. మరోవైపు.. సర్ కార్యక్రమంపై ముందుగా ప్రజల్లో విస్తృత ప్రచారంతో అవగాహన కల్పించాలని, బీఆర్ఎస్ నేతలు వినోద్‌కుమార్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కోరారు. మంగళవారం సీఈఓ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు.

## రైల్వేస్టేషన్‌ల అప్రోచ్ రోడ్లను విస్తరించండి

సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్, ఏప్రిల్ 28**

సికింద్రాబాద్, చర్లపల్లి రైల్వేస్టేషన్‌ల నుంచి ప్రయాణికులు సులభంగా రాకపోకలు సాగించడానికి వీలుగా అప్రోచ్ రోడ్లను విస్తరించాలని సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం రేవంత్‌కు కిషన్‌రెడ్డి ఈ మేరకు లేఖ రాశారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ తదితర అవసరాల కోసం స్టేషన్‌కు ఇరువైపులా అవసరమైన భూసేకరణను పూర్తి చేయాలని కోరారు. మరోవైపు, భవిష్యత్ రద్దీని దృష్టిలో పెట్టుకొని రూ.715 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఉత్తరం వైపు టెర్మినల్‌ను చేరుకోవడానికి ఇప్పుడు ఉన్న రహదారి చాలా ఇరుకుగా ఉందని, దీన్ని కూడా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు.

## కొత్త డీజీపీ సీవీ ఆనంద్

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్.. రేపు శివధర్‌రెడ్డి పదవీ విరమణ



**హైదరాబాద్, ఏప్రిల్ 28**

రాష్ట్ర నూతన డీజీపీగా 1991 బ్యాచ్ కు చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూపీఎస్సీ ఎంప్యానెల్ నివేదిక ప్రకారం సీవీ ఆనంద్‌ను పూర్తి స్థాయి డీజీపీగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి గురువారం పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరిస్తారు. వాస్తవానికి శివధర్ రెడ్డిని డీజీపీగా నియమించడం యూపీఎస్సీ నియామక ప్రక్రియకు వ్యతిరేకంగా జరిగిందని కొందరు సుప్రీంకోర్టులో కేసు వేయడంతో యూపీఎస్సీ నియమాల ప్రకారం జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్ర భుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్‌ల పేర్లతో కూడిన జాబితాను పంపించగా.. సీవీ ఆనంద్, వినాయక్‌ప్రభాకర్ ఆప్టే, సౌమ్యామిశ్రాల పేర్లను షార్ట్ లిస్టు చేసి యూపీఎ?ససీ ప్రభుత్వానికి తిరిగి పంపింది. వీరిలో ఆనంద్‌ను ప్రభుత్వం ఎంపిక చేసింది. కొత్త డీజీపీగా సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం నియమించనున్నట్లు తొలుత 'ఆంధ్రజ్యోతి' వెల్లడించిన విషయం తెలిసిందే.

## భానుడి భగభగలు

నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో అత్యధికంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత

ఆదిలాబాద్ జిల్లాలో రెడ్ అలర్ట్ జారీ

రాష్ట్రంలో వడదెబ్బకు ముగ్గురు మృతి



**హైదరాబాద్, ఏప్రిల్ 28**


రాష్ట్రంలో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లిలో అత్యధికంగా 45.9 ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ జిల్లాలో వరుసగా మూడు రోజులుగా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో 45.8 డిగ్రీలు నమోదైంది. మిగతా జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 43 నుంచి 45 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. పలుచోట్ల 45 డిగ్రీలు కూడా దాటింది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎండ తీవ్రతకు రహదారులపై వాహనాల రద్దీ తగ్గింది. గ్రేటర్ పరిధిలో మరో రెండు రోజుల పాటు సాయంత్రం, రాత్రి సమయంలో ఈదురు గాలులతో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వడదెబ్బకు ముగ్గురు మృతిచెందారు. కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ భూక్యా రవి(35), కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం ఇబ్రహీంపేటకు చెందిన తిప్ప నర్సింలు (30), హైదరాబాద్ ఎర్రగడ్డలో ప్యారాలాల్ (45) అనే యాచకుడు వడదెబ్బకు గురై చనిపోయారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం చాకలిగుడిసెల గ్రామంలో పసుపులేటి మణెమ్మ (50) అనే మహిళ పిడుగుపాటుకు గురై మృతిచెందింది.

# ఎంతకాలమీ నీతిబాహ్య రాజకీయాలు?

'మే 4 తర్వాత నేను బీజేపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారానికి మరోసారి బెంగాల్ రావాల్సి వస్తుంది' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం చివరి రోజు ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు. 'ఒడిషా, బిహార్ తర్వాత బెంగాల్‌లో కమలం వికసిస్తుంది' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ బెంగాల్ నలుమూలగా సీఏపీఎఫ్ దళాలను మోహరించింది. 'ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా మరో రెండు నెలలు ఈ దళాలు బెంగాల్‌లోనే ఉంటాయి' అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను, ముఖ్యంగా మహిళా ఓటర్లను పెద్ద ఎత్తున ఆకర్షించేందుకు మోదీ ప్రచార కార్యక్రమాలను ఉద్దేశిస్తే బెంగాల్‌లో 15 రోజులు మకాం వేసిన అమిత్ షా.. అతి సూక్ష్మ స్థాయిలో పార్టీ ఎన్నికల వ్యూహరచన చేయడంలో అపర చాణక్యుడు. ఒక రాష్ట్రాన్ని గెలుచుకునేందుకు ఈ నాయక ద్వయం ఎన్నికలకు ఎంతో ముందే పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తుంది. గెలిచేందుకు కావల్సిన కథనాన్ని సృష్టిస్తారు. సామ దాన భేద దండోపాయాల్ని ప్రయోగిస్తారు. అన్ని వ్యవస్థల్నీ ఉపయోగించుకుంటారు. 2.5 లక్షలమంది భద్రతా బలగాలతో బెంగాల్‌ను ఒక రణరంగంగా మార్చివేశారు. ఇన్ని చేసినా బెంగాల్‌లో బీజేపీ అధికారానికి రాగలుగుతుందా? ప్రజలు మార్పు కోరుకుని, హిందువులు సంఘటితమై, మహిళలు ఎక్కువ సంఖ్యలో మొగ్గు చూపితే, వ్యవస్థలు పూర్తిగా సహకరిస్తే బీజేపీ విజయం ఖాయమే. అయితే బెంగాల్ ప్రజలు మమతా బెనర్జీని తమ అస్తిత్వానికి చిహ్నంగా భావించి, హిందూత్వ ప్రభావాలకు లోను కాకపోతే తృణమూల్ కాంగ్రెస్ వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చి తీరుతుంది. నిజానికి రాహుల్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ కూడా బెంగాల్లో మమతా బెనర్జీ విజయం సాధించాలనుకోవడం లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి కలిసికట్టుగా పార్లమెంటులో ప్రతిఘటించినప్పుడు తృణమూల్ అండగా నిలిచింది. ఆ మరునాడే రాహుల్‌గాంధీ బెంగాల్‌లో పర్యటించి మమతా బెనర్జీ అవినీతి పాలనను తీవ్రంగా విమర్శించారు. బెంగాల్‌లో హిందూ ఓటర్లు సంఘటితం కావడానికి ఆమె విధానాలే కారణమని నిరసించారు. ఒకవైపు ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ మమతా బెనర్జీకి మద్దతుగా ప్రచారం చేస్తే.. కాంగ్రెస్, వామపక్షాలు ఆమెను తీవ్రంగా దుయ్యబట్టాయి. వాటి వైఖరి ఇండియా కూటమిలో చీలికను ప్రస్ఫుటం చేయడమేగాక, బీజేపీకి ఎంతో కొంత ఉపయోగపడే అవకాశాలున్నాయి. గతంలో వెంకయ్యనాయుడు అభివర్ణించినట్లుగా కాంగ్రెస్ 'ఢిల్లీలో దోస్తీ, గల్లీల్లో కుస్తీ' అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ఒకవైపు బీజేపీ జాతీయ స్థాయిలోనే కాక, ప్రాంతీయ స్థాయిలో కూడా ఎన్డీఏలోని వివిధ శక్తుల్ని సంఘటితం చేస్తే కాంగ్రెస్ దేశమంతటా బీజేపీని ఎదుర్కోగల బలమైన కూటమిని ఏర్పర్చుకోలేకపోతోంది. ఇది ఆ పార్టీ బలహీనతను ఎత్తి చూపుతోంది. మమతా బెనర్జీ పట్ల మాత్రమే కాకుండా, కేజ్రీవాల్ విషయంలో కూడా కాంగ్రెస్ ఒకే వైఖరి అవలంబిస్తోంది. అందుకు కారణాలు లేకపోలేదు. అయితే దేశంలో స్వతంత్రంగా వ్యవహరించే ప్రాంతీయ పార్టీలు ఒంటరై, ఆత్మరక్షణలో పడుతున్నాయనడానికి ఇది నిదర్శనం. ఒకవైపు బెంగాల్ ఎన్నికల హోరు సాగుతుండగానే మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలు బీజేపీలో చేరడం విస్మరించలేని ఆసక్తికర పరిణామం. ఇది సూచిస్తున్నదేమిటి? ప్రస్తుత అసెంబ్లీ పోరాటాలు ఇంకా ముగియక ముందే మరో ఎనిమిది నెలల తర్వాత ఎన్నికలు జరిగే పంజాబ్‌పై బీజేపీ అగ్రనేతలు దృష్టి సారించారు! ఆ రాష్ట్రంలో ఆప్ ప్రభుత్వంపై ప్రబలుతోన్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని అక్కడ బీజేపీని బలోపేతం చేసేందుకు పకడ్బందీగా వ్యూహరచన చేసినట్లు కనపడుతోంది. పంజాబ్‌లో ఆప్ విజయానికి కారకుడైన రాఘవ్ చద్దాను లోబరుచుకుని, ఇతర ఎంపీలను ఈడీ, సీబీఐ కేసులతో భయభ్రాంతులకు గురి చేసిందన్న విమర్శలకు తావున్నప్పటికీ ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ వ్యవహార శైలి కూడా ఈ విపరిణామానికి కారణమనడంలో సందేహం లేదు. వన్ మ్యాన్ పార్టీ అయిన ఆప్‌ను పంజాబ్‌లోనే కాదు, ఢిల్లీలో కూడా బలహీనపరిచేందుకు, ఆ పార్టీ నేతలను తమ వైపునకు తిప్పుకునేందుకు బీజేపీ అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఇదీ బీజేపీ నీతి. దేశ రాజకీయాల్లో తమ ఆధిపత్యాన్ని నిరూపించుకునేందుకు, ప్రత్యర్థి పార్టీలను బలహీనపరి చేందుకు అన్ని ఆయుధాలు ప్రయోగించడంలో బీజేపీ అగ్రనేతలు ఆరితేరారు. రాజ్యసభ సీట్లను ఆప్ విక్రయించిన తీరు కూడా ఈ భ్రష్ట రాజకీయానికి దారితీసింది. సీట్లను కొనుగోలు చేసిన వారిని భయపెట్టడం, మళ్లీ కొనుగోలు చేయడం పెద్ద విషయం కాదు. యోగేంద్రయాదవ్, ప్రశాంత్ భూషణ్, అశుతోష్, షాజియా ఇల్మీ లాంటి వారిని అవమానించి బయటకు పంపి పారిశ్రామికవేత్తలు, కోటీశ్వరులను అందలాలు ఎక్కించడమే ఆప్‌ను నైతికంగా బలహీనపరిచింది. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ ప్రాంతీయ రాజకీయ పక్షమే అయినప్పటికీ సాగరికా ఘోష్ వంటి జర్నలిస్టును, మేనకా గురుస్వామి వంటి న్యాయవాదిని, అణగారిన వర్గాలకు చెందిన మమతా బాలా ఠాకూర్‌ను రాజ్యసభకు పంపించారు. సీపీఎం కేరళ నుంచి జాన్ బ్రిటాస్ అనే జర్నలిస్టును రాజ్యసభకు పంపింది. ఇలాంటి వారిని బీజేపీ తమ వైపునకు తిప్పుకోగలదా? ప్రాంతీయ పార్టీలు పార్లమెంటుకు ఎవరిని పంపించాలన్న విషయంలో ఎంత ఆచితూచి వ్యవహరించాలో ఈ ఘట్టం తెలియజేస్తోంది. ఏడుగురు ఆప్ ఎంపీలు ఒక శుభోదయాన తమ పార్టీని వదిలి మరో పార్టీలో చేరడం భారతదేశ రాజకీయాలు ఎంత హీనమైన స్థితికి చేరుకున్నాయో చెప్పేందుకు ఒక బలమైన ఉదాహరణ. నిన్నటి వరకు బీజేపీని సీబీఐ, ఈడీలను ప్రయోగించే గూండాల పార్టీగా అభివర్ణించిన రాఘవ్ చద్దా, ఆయన స్థానంలో విప్‌గా నియమితుడైన అశోక్ మిట్టల్ బీజేపీకి ఫిరాయించడం ద్వారా ఏ సంకేతాలను పంపిస్తున్నారు? ఇలాంటి వారిని ఎంపీలుగా చేసేందుకే పార్లమెంటులో సీట్లు పెంచాలనుకుంటున్నారా? ప్రజల నుంచి నేరుగా ఎన్నిక కాని రాజ్యసభ ఎంపీలను వారి పార్టీ ఎమ్మెల్యేలే ఎన్నుకుంటారు. ఆ ఎమ్మెల్యేలు అదే పార్టీలో ఉన్నప్పుడు రాజ్యసభలో ఉన్నవారు మాత్రం ఫిరాయించడం చట్టబద్ధం ఎలా అవుతుంది? ప్రస్తుతం అమలులో ఉన్న ఫిరాయింపుదారుల చట్టం ఫిరాయింపులను అరికట్టడానికి కాకుండా చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని చట్ట విరుద్ధ చర్యలను ప్రోత్సహించడానికేనన్న విషయం స్పష్టమవుతోంది. సైద్ధాంతిక నిబద్ధత, రాజకీయ నైతికతను విస్మరించి స్వార్థ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చినప్పుడు మిగతా వ్యవస్థలు దిగజారకుండా ఉంటాయా? ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడు భారతదేశాన్ని 'యమకూపం' అని అభివర్ణిస్తూ అన్న మాటలు పూర్తిగా అసంబద్ధమైనవి.

# అపర కుబేరుడు

# ఆ సోనా దిలీపుడు..?!



- అప్పుల పేరుతో ఆస్తులు దిగమింగేస్తున్న ఉద్దండుడు
- తీసుకున్న అప్పుల వడ్డీలకే బలవుతున్న బాధితుల కుటుంబాలు..!
- కోటి అప్పు ఇచ్చి.. కోట్ల విలువైన ఆస్తులు రాసించుకుంటున్న వైనం..?
- బంగారం, భవనాలు, భూముల తాకట్టు పేరుతో వందల కుటుంబాలు గాడంధాకారంలోకి..?
- జిల్లాలో పలువురు ప్రముఖులు ఇతగాడి వలలో చిక్కుకున్న వారే..?
- వందల కోట్ల టర్నోవర్‌తో గుప్పెట్లోకి జనాల ఆస్తులు..
- 'వెంకటేశ్వరుడి లాగే ఈ దిలీపుడి అప్పులు తీరవంటూ' బాధితుల గగ్గోలు..!

**మంచిర్యాల,ఏప్రిల్ 28,(మన సమాజం):**

**ఆయన మామూలు మామూలోడు కాదు. అపర కుబేరుడు. బంగారం, భవనాలు, భూముల తాకట్టు.. వడ్డీ వ్యాపారం ఇలా ఇతగాడికి లేని దందా అంటూ ఏమీ లేదు. బాధల్లో ఉన్న వారు చేతికి చిక్కేదాకా సుతిమెత్తగా వల వేసే ఈ వైట్ కాలర్ కార్పొరేట్ వ్యాపారి ఆనక తన వీర ప్రతాపం చూపిస్తాడు. చూపించగలడు కూడా. కోటి రూపాయల అప్పిచ్చి.. కోట్ల రూపాయల విలువైన ఆస్తులు చెర పట్టే ఘనుడు ఈయన. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఇతగాడి చేతికి విలవిలలాడుతున్న వారెందరో ఉన్నారంటే అతిశయోక్తి కాదేమో. మామూలు స్థాయి నుండి మంచి పలుకుబడి ఉన్న వారంతా ఇతగాడి అప్పుల ఊబిలో కూరుకుపోయి గిలగిల తన్నుకు చస్తున్న పరిస్థితి ఏర్పడింది. మరో అంబానీలా కోట్లకు పడగలెత్తి, కోట్లలోనే వడ్డీ మొత్తాన్ని కొల్లగొట్టేది ఎవరో కాదు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన సోనా దిలీపుడు. పూర్తి వివరాల్లోకి వెళితే...**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సోనా సామ్రాజ్య సామ్రాట్ దిలీపుడు. బంగారం నుండి మొదలుపెట్టి రియల్ ఎస్టేట్ రంగం, భూముల తనఖా, తాకట్టు వ్యవహారాలు, వడ్డీ వ్యాపారం ఒక్కటనేమిటీ సవాలక్ష దందాలు ఈ షేఠ్ వి. ఏదైనా పని బడి ఇతగాడిని ఆశ్రయించామో..? ఇక మన పనై పోయినట్లే..!! ఒకటికి రెండు.. కానేకాదు పది ఇరవై రూపాయల వడ్డీ చొప్పున గుంజుతున్న ఘనాపాటి ఈ దిలీపుడు. మరో విశేషమేమంటే 'కోటి రూపాయల అప్పు తీసుకుంటున్నాం' అనుకోండి... ఆ ఇచ్చిన అప్పు కింద వడ్డీ కట్టేందుకే కొన్ని కోట్ల రూపాయల వడ్డీ పలువురు చెల్లిస్తున్నట్లు తాజాగా వెలుగులోకి రావడం విశేషం. కొన్ని వందల మంది ఇతగాడి మోసపూరిత అప్పుల ఊబిలో కూరుకు పోయిన విలవిలలాడుతున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న పలువురు ప్రముఖులు 'ఎందుకురా బాబు ఈ షేఠ్ దగ్గర అప్పు తీసుకుంటున్నం' అంటూ మానసిక వేదనకు గురవుతున్నారంటే అతగాడి ధనదాహం కుట్రలు ఎలా ఉంటాయనేది అంచనా వేసుకోవచ్చు. పదికి ముప్పై, నలభై అవసరమైతే ఎంతైనా అన్న తరహాలో ఈ బంగారం దిలీపుడి వికృత చేష్టలు ఉంటాయని పలువురు వాపోతున్నారు.

## భూములు, బిల్డింగులు రాయించు కోవడమే..?

ఈ బంగారం షేఠ్ చేతిలో కొన్ని వందల కోట్ల విలువ గల ప్లాట్లు, బిల్డింగులు తనఖా రూపంలో ఉండడం గమనార్హం. 'కుదువ పెట్టుకో.. అప్పు తీసుకో..' అన్న ఆర్థిక సూత్రాన్ని వ్యాపారంగా మలచుకొని బాధితుల బిల్డింగులే తనఖా పెట్టుకుంటున్న ఘనుడు ఈ సోనా దిలీపుడు. కనుకనే ప్రతి నెలా కొన్ని కోట్లల్లోనే వడ్డీ వచ్చి చేరుతుందనే చర్చ బెల్లంపల్లి పట్టణంలో బాహాటంగానే జరుగుతోంది. వివిధ రంగాల్లో ఆరితేరిన వాడు కావడంతో చాలా మంది నమ్మకంతో ఆశ్రయిస్తే నట్టేటా ముంచడం ఈ షేఠ్ కు వెన్నతో పెట్టిన విద్య అని బాబా బాధితులు చెబుతున్నారు. పోలీసులను సైతం అవలీలగా ఏమార్చి తన దందాలను యదేచ్ఛగా నడుపుతున్నాడంటే ఆయన అనధికార అక్రమ వడ్డీ వ్యాపార లావాదేవీలు ఏ విధంగా సాగుతున్నాయో..! ఒకటో తారీఖు వస్తుందనగానే ఈ షేఠ్ కు కట్టబోయే అప్పు, వడ్డీ తెగ బెంబేలెత్తిస్తుందని చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనధికారికంగా సాగుతున్న ఈ బంగారం షేఠ్ వడ్డీ వ్యాపారాలు ఆగుతాయో.. అందులో చిక్కుకున్న బాధితులు ఎప్పుడు బయట పడతారో..!

# క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయి..

## సిఐ పర్స రమేష్..

**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 28, (మన సమాజం):**
క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని మందమర్రి సిఐ పర్స రమేష్ అన్నారు. మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఠాగూర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా అండర్-16 బాలికల ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలను సీఐ రమేష్, క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ గోడిసెల సంధ్యారాణి-రాజారమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. స్నేహ బంధాన్ని క్రమశిక్షణను పెంపొందించే క్రీడల్లో పాల్గొంటున్న ప్రతి జట్టుకు ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన మ్యాచ్ లో గజ్వేల్ వనపర్తి జట్లు తలపడగా వనపర్తి జట్టు 2-0 తేడాతో విజయం సాధించింది. ఆదిలాబాద్ రంగారెడ్డి జట్ల మధ్య జరిగిన పోటీలో ఆదిలాబాద్ విజయం సాధించిగా హైదరాబాద్ సిద్దిపేట జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో 1-0తేడాతో హైదరాబాద్ జట్టు విజయం సాధించింది. నిజామాబాద్ కరీంనగర్ జట్ల మధ్య జరిగిన పోరులో నిజామాబాద్ జట్టు గెలుపొందింది. ఉత్కంఠ భరితంగా జరుగుతున్న పోటీలను వీక్షించడానికి క్రీడాకారులు, క్రీడా అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ పాల్గుణ, కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత-శ్రీనివాస్, ఎస్సై జాడి శ్రీధర్, నిర్వాహకులు పల్లె రాజు, ఓడ్నాల శ్రీనివాస్, పీఈటీలు పాల్గొన్నారు.



# దుర్గ మాత ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలి

**నెల్లికుదురు, ఏప్రిల్ 28**
దుర్గామాత ఆశీస్సులతో రతి రామ్ తండా గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ ఆకాంక్షించారు. మంగళవారం మండలంలోని రత్తి రామ్ తండాలో నిర్వహించిన దుర్గామాత ఉత్సవాల్లో ఆయన మండల నేతలతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపాలే గ్రామదేవతల పండుగలు అన్నారు. దుర్గామాత ఆశీస్సులు తండాలోని ప్రజలందరిపై ఉండాలని, సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక సర్పంచ్ గుగులోతు సుజాత హరిలాల్, సత్కరించారు.




## కన్నీళ్లను ఆపుకోలేకపోయా!

దక్షిణాదిలో తిరుగులేని స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న సాయిపల్లవి 'ఏక్ దిన్' చిత్రంతో హిందీ చిత్రసీమలోకి అరంగేట్రం చేస్తున్నది. అమీర్‌ఖాన్ కుమారుడు జునైద్‌ఖాన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి సునీల్ పాండే దర్శకుడు. అమీర్‌ఖాన్ నిర్మాణ భాగస్వామి. మే 1న సినిమా విడుదల కానున్నది. ఈ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సాయిపల్లవి భావోద్వేగభరితంగా మాట్లాడింది. తాను ఇప్పటివరకు ఏం సాధించానో తెలియదని, అయితే వివిధ భాషల్లో గొప్ప ప్రతిభావంతులతో కలిసి పనిచేశాననే సంతృప్తి మాత్రం మిగిలిందని చెప్పింది. హిందీ ప్రేక్షకులు తనను ఎలా స్వీకరిస్తారోనని కాస్త ఆందోళనగా ఉందని సాయిపల్లవి తెలిపింది. 'ఈ సినిమా చూసి కన్నీళ్లను ఆపుకోలేకపోయా. చుట్టూ లైట్స్ లేకుండా ఉంటే ఏడుపు ఆగేది కాదు. అమీర్‌ఖాన్‌లా అందరి ముందు ఎమోషనల్ అవ్వాలంటే చాలా ధైర్యం కావాలి. నేను మాత్రం భావోద్వేగాలను చాలా వరకు కంట్రోల్ చేసుకున్నా. 'ఏక్ దిన్' హృద్యమైన ప్రేమకథ. బాలీవుడ్‌లో నాకు శు భారంభాన్నిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పింది. ఈ సినిమా 'ఒక రోజు' టైటిల్‌తో తెలుగులో విడుదలకానుంది.

## మళ్లీ థియేటర్లలో 'కృష్ణ' ...

### రవితేజ మాస్ వినోదం రీ-రిలీజ్‌కు రెడీ



మాస్ మహారాజా రవితేజ కెరీర్‌లో ఘన విజయాన్ని అందుకున్న యాక్షన్ కామెడీ చిత్రం 'కృష్ణ' మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 2008లో విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించిన ఈ చిత్రం, ఇప్పుడు మే 8న థియేటర్లలో తిరిగి విడుదల కానుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు వివి వినాయక్ తెరకెక్కించగా, అందాల నటి త్రిష కృష్ణన్ హీరోయిన్‌గా నటించారు. విడుదలైన సమయంలో ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుని రవితేజ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. ప్రత్యేకంగా రవితేజ ఎనర్జీ, శైలీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక హాస్యనటుడు బ్రహ్మానందం తో కలిసి చేసిన హాస్య సన్నివేశాలు ఇప్పటికీ ప్రేక్షకులను నవ్విస్తూనే ఉన్నాయి. ఈ జంట మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు మరింత ప్రాధాన్యం తీసుకువచ్చాయి. సంగీత దర్శకుడు చక్రి అందించిన పాటలు అప్పట్లోనే విశేష ఆదరణ పొందాయి. ఇప్పటికీ ఆ పాటలు వినిపిస్తూనే ఉంటాయి. యాక్షన్, హాస్యం, సంగీతం అన్నీ కలిసిన ఈ చిత్రం సంపూర్ణ వినోదాన్ని అందించింది. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమాను ఇప్పుడు ఆధునిక సాంకేతికతతో మెరుగైన నాణ్యతలో తిరిగి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. దీంతో కొత్త తరానికి కూడా ఈ సినిమా చూడడానికి మంచి అవకాశం లభించనుంది. పాత హిట్ చిత్రాల రీ-రిలీజ్‌లకు ప్రస్తుతం మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో 'కృష్ణ' కూడా థియేటర్లలో మళ్లీ విజయాన్ని అందుకుంటుందనే అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా రవితేజ అభిమానులు ఈ సినిమాను పెద్ద తెరపై మరోసారి ఆస్వాదించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'కృష్ణ' రీ-రిలీజ్ పాత జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేస్తూ ప్రేక్షకులకు వినోదాన్ని అందించబోతోంది. ఇక హిట్స్ లేకపోయిన కూడా రవితేజ వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులని అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. శ్రీవిష్ణుతో 'రాజరాజ చోర' లాంటి చిత్రాన్ని రూపొందించిన హసిత్ గోలీ దర్శకత్వంలో రవితేజ ఓ సినిమా చేయబోతున్నారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మించనున్న ఈ చిత్రానికి 'అక్కాయిలు బాగున్నారా?' అనే టైటిల్‌ని అనుకుంటున్నారట.



## లాయర్ పాత్రలో



కాజల్ అగర్వాల్ లాయర్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'ది ఇండియా స్టోరీ'. చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సాగర్ బి షిండే నిర్మిస్తున్నారు. జూలై 24న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. పంటసాగులో పురుగు మందుల వినియోగం, పెస్టిసైడ్స్ కంపెనీల కుంభకోణాల నేపథ్యంలో రైతు సమస్యల్ని, సమకాలీన అంశాల్ని చర్చిస్తూ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వ్యవస్థలోని అవినీతిపై పోరాడే న్యాయవాదిగా కాజల్ అగర్వాల్ కనిపించనుంది. రసాయనాల దుర్వినియోగం కేవలం పర్యావరణ సమస్య కాదని, అది మానవ సంక్షోభానికి దారితీస్తుందని, ఈ సినిమా ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించబోతున్నామని నిర్మాత సాగర్ బి షిండే తెలిపారు. నిజాయితీగా చేసిన ప్రయత్నమిదని, సందేశంతో పాటు వినోదాత్మక అంశాలుంటాయని దర్శకుడు చేతన్ డీకే చెప్పారు. ఈ చిత్రంలో కథానాయకుడిగా శ్రేయస్ తల్పడే నటిస్తున్నారు. జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నది.

## వచ్చే ఏడాది దర్శకత్వం!

'గాయపడ్డ సింహం' చిత్రంలో తాను అతిథి పాత్రలో కనిపిస్తానని, హీరో తరుణ్‌భాస్కర్‌తో ఓ రొమాంటిక్ ట్రాక్ కూడా ఉంటుందని, వ్లాగర్‌గా తన పాత్ర కావాల్సినంత వినోదాన్ని పంచుతుందని చెప్పింది ఫరియా అబ్దుల్లా. తరుణ్‌భాస్కర్ కథానాయకుడిగా కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన 'గాయపడ్డ సింహం' చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం ఫరియా అబ్దుల్లా విలేకరులతో సినిమా విశేషాలను పంచుకుంది. తన పాత్ర పేరు శాలిని అని, ఆద్యంతం వినోదప్రధానంగా సాగుతుందని తెలిపింది. తరుణ్‌భాస్కర్ కామెడీ టైమింగ్ అద్భుతమని, ఆయన చిన్న ఎక్స్‌ప్రెషన్ కూడా నవ్వు తెప్పిస్తుందని, తమ మధ్య వచ్చే సన్నివేశాలు హిలేరియస్‌గా ఉంటాయని ఫరియా అబ్దులా పేర్కొన్నది. దర్శకత్వం చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నానని, ప్రస్తుతం కొన్ని కథల్ని సిద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నానని, వచ్చే ఏడాది తప్పకుండా సినిమా డైరెక్షన్ చేస్తానని చెప్పింది. తదుపరి సినిమా వివరాలు తెలియజేస్తూ 'ప్రస్తుతం 'భగవంతుడు' 'సిగ్మా' చిత్రాల్లో నటిస్తున్నా. మరో రెండు సినిమాలు త్వరలో ప్రారంభమవుతాయి. సత్యదేవ్‌తో ఓ సినిమా ఉంటుంది' అని చెప్పింది.